క్లుప్తంగా

కార్యవర్గం ఎన్నిక

నేరడిగొండ: రోల్ మామడ టోల్ ప్లాజా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా నక్క లక్ష్మణ్, రాజేశఖర్‌లు ఎన్నికయ్యారు. కమిటీ ఉపాధ్యక్షులు, కార్యదర్శులు గోవింద్ సింగ్, రమేష్, సురేందర్, చంద్రశేఖర్, కోశాధికారి షేక్ అహ్మద్, ఈసీ సభ్యులు రూపేష్, శేఖర్, దశరథ్, రాము, సతీష్, టోల్ ప్లాజా కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన



విద్యార్థులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. వ్యవసాయ రంగం ప్రాధాన్యత, నూతన సాంకేతిక పద్ధతులు, భూసార పరీక్షల గురించి అడిగి తెలుసుకున్నారు. శాస్త్రవేత్తలు ప్రవీణ్ కుమార్, రాజశేఖర్ పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంతోశ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన

నేరడిగొండ: మండలంలోని వెంకటాపూర్‌లో చేపడుతున్న ఉపాధిహామీ పనులను సోమవారం ఎంపీడీవో రాజ్‌వీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు ఉపయోగపడే పనులను చేపట్టాలని సూచించారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ఉదయం పూటనే పనులకు వెళ్లాలన్నారు. పనికి తగిన కూలీ వచ్చేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధిహామీ టీఏ, ఎఫ్ఏ ఉన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

నేరడిగొండ: మండలంలోని బోరిగామ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు హైమాస్ట్ లైట్లను గ్రామస్తులు సోమవారం ప్రారంభించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సహకారంతో లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామంలోని సమస్యలను ఇది వరకే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయించారని పేర్కొన్నారు.

భజన్‌లాల్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ఎదులాపురం: రోడ్డు ప్రమాదానికి గురై జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో చికిత్స పొందుతున్న మధ్యాహ్న భోజన కార్మికుడు భజన్‌లాల్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంటాల రాములు డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడిని సోమవారం పరామర్శించారు. ఎండీఎం కార్మికుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఎంఈవో, డీఈవోలను కలిసి బిల్లులు అందేలా చూస్తానన్నారు.

'కార్మిక సమస్యలపై చిత్తశుద్ధి లేదు'

ఎదులాపురం: కార్మిక సమస్యలపై మోదీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ యూసుఫ్, బలరాజు, రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశంలో పాల్గొన్నారు. కార్మిక సమస్యలపై సుదీర్ఘంగా చర్చించనట్లు, భవిష్యత్ పోరాటాలను రూపొందించినట్లు వివరించారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్యాయత్నం

ఆదిలాబాద్‌టౌన్: భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. టూటౌన్ పరిధిలోని ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్య ఆరు నెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. సోమవారం ఆమెను కలిసి కాపురానికి రావాలని కోరాడు. ఆమె నిరాకరించడంతో మనస్తాపానికి గురైన ఆయన ఇంటికి తిరిగి వచ్చి ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం శరీరం 60శాతం కాలిపోయినట్లు వైద్యులు తెలిపారు.

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: నార్నూర్ మండలానికి చెందిన ఓ యువతి జిల్లా కేంద్రంలోని అష్టలక్ష్మి జిన్నింగ్ మిల్లులో పని చేస్తుంది. పెళ్లి చేస్తామని కుటుంబీకులు గత నెల 13న ఆమెను ఫ్యాక్టరీ నుంచి తీసుకెళ్లేందుకు వచ్చారు. ఫ్యాక్టరీ నుంచి ఆదిలాబాద్ బస్టాండ్‌కు వచ్చిన తర్వాత వాటర్ బాటిల్ కోసమని వెళ్లి తిరిగి రాలేదు. దీంతో చుట్టుపక్కలా వెతికిన కనిపించ లేదు. దీంతో సోమవారం కుటుంబీకులు టూటౌన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు.

సేంద్రియ ఎరువులకు డిమాండ్

- ఆసక్తి చూపుతున్న రైతులు
- భూసారం పెరగడంతో పాటు అధిక దిగుబడి



తాంసి శివారులో పంట చేనులో వేసిన సేంద్రియ ఎరువు

తాంసి: పంటల సాగులో రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం పెరిగిపోవడంతో రైతులకు ఆర్థిక భారమవుతుంది. అలాగే రసాయన ఎరువుల వాడకంతో భూమి నిస్సారమతోంది. ప్రతీఏటా పంటలకు మూడు నుంచి నాలుగు సార్లకుపైగా రసాయన ఎరువులు వేస్తున్నారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది. ఈక్రమంలో రైతులు సేంద్రియ ఎరువుల వాడకం వైపు మొగ్గు చూపుతున్నారు. సేంద్రియ ఎరువులతో పంట దిగుబడి రావడంతో పాటు, చీడపీడల వ్యాప్తి తగ్గిందని రైతులు చెబుతున్నారు. దీంతో సేంద్రియ ఎరువులకు డిమాండ్ పెరిగింది.

సేంద్రియ ఎరువులో పోషకాలు..

సేంద్రియ ఎరువులో పంట ఎదుగుదలకు అవసరమైన అన్ని రకాల పోషకాలు ఉంటాయి. సాగుభూముల భూసారం పెరిగి మొక్కలకు ఎదిగేందుకు దోహదపడుతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఎరువులతో పాటు వాటిలో నత్రజని, పోటాష్, భాస్వరం సైతం ఉంటాయి. ఈకారనంగా ఎలాంటి రసాయన ఎరువులు ఉపయోగించకుండా పంటలు పండించే అవకాశం ఉంది. సేంద్రియ ఎరువులను వేసి కలియ దున్నితే దిగుబడి సైతం పెరిగే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు రైతులకు సూచిస్తున్నారు.

పెరిగిన ధరలు..

రైతులలో సేంద్రియ ఎరువులను ఉపయోగించాలని అవగాహన పెరుగడంతో అధిక సంఖ్యలో రైతులు చేలల్లో సేంద్రియ ఎరువులు వేసేందుకు ముందుకు వస్తున్నారు. పశువుల, మేకలు, గొర్రెల పెంపకందారులు సేంద్రియ ఎరువుల ధరలను కూడా పెంచేశారు.

- ట్రాక్టర్ ఎరువు ధర రూ. 1800 నుంచి రూ.2వేల వరకు ఉండగా.. ప్రస్తుతం రూ.2500 నుంచి రూ.3 వేల వరకు ఉంది. మేకలు, గొర్రెల ఎరువు గతంలో రూ.3 వేలు ఉండగా ప్రస్తుతం ట్రాక్టర్ రూ.4వేల పైగా ధర పలుకుతోంది.
- ఎరువుల లారీ విలువ రూ.12వేల నుంచి రూ.15వేల వరకు ఉంది. ఇక్కడ అవసరమైన ఎరువులు దొరకని రైతులు దూర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి పంట చేలలో వేసుకుంటున్నారు. సీజన్ దగ్గరకు వచ్చే కొద్ది మరింత ధరలు పెరిగే అవకాశం ఉంది.

పత్తి దిగుబడి బాగా వచ్చింది



గతేడాది రెండు ఎకరాల్లో రూ.30 వేలు ఖర్చు చేసి పశువుల ఎరువు వేయించాను. రెండు ఎకరా ల్లో పూర్తిగా సేంద్రియ ఎరువులను వేయడంతో పంట దిగుబడి బాగా వచ్చింది. పశువుల ఎరువును వేయడంతో పత్తి పంటకు ఎలాంటి తెగులు సోకలేదు. భూమిసారం పెరగడంతో ఎకరానికి 18 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి వచ్చింది.

– గంగాధర్, రైతు, వడ్డాడి

సేంద్రియ ఎరువుతోనే లాభం



పంట చేలలో సేంద్రియ ఎరువుతోనే లాభం ఉంటుంది. సేంద్రియ ఎరువులతో పాటు పశువుల పేడ, మూత్రం ద్వారా అధిక దిగుబడి రావడంతో పాటు పెట్టుబడి ఖర్చులు సైతం తగ్గుతాయి. ప్రతీ మూడేళ్లకు ఒకసారి సేంద్రియ ఎరువులలో భాగంగా పశువుల ఎరువును చేన్లలో వేసుకుంటాను.

– అడెల్లు, రైతు, పొన్నారి

ముందస్తు ఉగాది వేడుకలు



ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

తాంసి: మండలంలోని కప్పర్ల ప్రాథమిక పాఠశాలలో ముందుస్తుగా ఉగాది వేడుకలను సోమవారం నిర్వహించారు. తెలుగు నూతన సంవత్సరంలో భాగంగా పాఠశాలలో విద్యార్థులకు ఉగాది విశిష్టతను వివరించారు. అనంతరం విద్యార్థులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాజన్న, ఉపాధ్యాయులు జయవర్ధన్ రెడ్డి, లక్ష్మి, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: బోథ్ మండలంలోని సొనాల వివేకానంద పాఠశాలలో సోమవారం ఉగాది వేడుకలు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణ చైతన్య ఉగాది పండుగ విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్నేహిక, రజిని, సౌమ్య, నిత్య, దివ్య, ప్రవలిక, సుష్మ పాల్గొన్నారు.

ఉగాదిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: ఉగాది పండుగను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు ఉగాది పండుగ శుభా కాంక్షలు తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

నేరడిగొండ: మత సామరస్యానికి పవిత్ర రంజాన్ ప్రతీకగా నిలుస్తుందని వాంకిడి గ్రామ పెద్దలు అన్నారు. రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా సోమవారం హిందువులు ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. అందరూ సుఖ సంతోషలతో ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు బొబ్బిలి నవీన్, తాజా మాజీ సర్పంచ్ అడిగం రాజు, అనిల్ యాదవ్, భరత్, నజీర్ పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంలోని మదీనా మసీదు వద్ద ముస్లింలకు కాంగ్రెస్ నాయకులు సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, ఫైజుల్లాఖాన్, గావుండే ఘణేశ్యాం, మడావి చంద్రకాంత్ పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

అందరూ సోదరభావంతో మెలగాలి

నేరడిగొండ: పండుగలను శాంతియుతంగా జరుపుకుంటూ సోదరభావంతో మెలగాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం బోథ్ మండలంలోని కౌట (బి)గ్రామంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ముస్లింలకు పండ్లు తినిపించి దీక్ష విరమణ చేయించారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రవిశంకర్

నేరడిగొండ: నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి రవిశంకర్ అన్నారు. సోమవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో తాగునీటిపై పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామపంచాయతీల పరిధిలో నీటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో రాజ్‌వీర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫేరోజ్, ఎంపీవో లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో లక్ష్మణ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో సుభాష్‌నగర్, విద్యానగర్ కాలనీలో పర్యటించారు. సుభాష్‌నగర్‌లో బోరుబావిని పరిశీలించి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

తలమడుగు: మండలంలో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని తహసీల్దార్ రాజ్‌మోహన్ అన్నారు. సోమవారం లక్ష్మింపూర్ గ్రామంలో తాగునీటి బావి మరమ్మతు పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్, ఎంపీవో వినోద్‌కుమార్, మిషన్ భగీరథ ఏఈ మహేశ్, పంచాయతీ కార్యదర్శి సంతోష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశువైద్య శిబిరం

ఇచ్చోడ: మండలంలోని గుండి, గుండివాగు గ్రామాల్లో సోమవారం పశువైద్యాధికారి గోవింద్‌నాయక్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. గ్రామంలోని పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన ర్యాలీ



ర్యాలీ ప్రారంభిస్తున్న కమల్ కిషోర్

కైలాస్‌నగర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో వంద శాతం పోలింగ్ నమోదయ్యేలా కృషి చేసే యువజన సంఘాలకు రూ.10 వేల చొప్పున పారితోషికం, నగదు బహుమతులను అందిస్తామని ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి గంద్రత్ సంతోశ్ అన్నారు. సోమవారం స్వీప్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌక్ నుంచి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కమల్ కిషోర్ అగర్వాల్ జెండా ఊపి ప్రారంభించారు. వ్యాపారులంతా ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శిక్షణ అధికారి వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షుడు కొత్తవార్ రాజేశ్వర్, నాలం అనిల్, దోమకొండవార్ గోవింద్, ఉపలంచి వార్ శ్రీనివాస్, చిలువేరి విద్యాసాగర్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణ కోసమే 'ఫ్లాగ్‌మార్చ్'



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

నార్నూర్: లోకసభ ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించడం జరుగుతుందని నార్నూర్, గాదిగూడ ఎస్సైలు రవి కిరణ్, మహేష్ కుమార్‌లు అన్నారు. సోమవారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో కేంద్రబలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు. తప్పనిసరిగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ఎక్కడైనా ఎటువంటి సమస్యలు ఉన్నా.. నేరుగా సంప్రదించాలని సూచించారు. గ్రామాల్లో పోలీస్ కవాతు నిర్వహించారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహించవద్దన్నారు. లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీస్ కవాతు నిర్వహించినట్లు తెలిపారు. వారి వెంట సీఆర్పీఎఫ్ సీఐ సూరజ్, భీంపూర్ ఎస్సై ప్రదీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు నిర్భయంగా వినియోగించుకోవాలి

తాంసి: లోక్‌సభ ఎన్నికల్లో ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని జైనథ్ సీఐ సాయినాథ్ కోరారు. సోమవారం నిపాని, పిప్పల్ కోటి

సఖీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న యశోద

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా మహిళా సాధికారత కేంద్రం, సఖీ కేంద్రం ఆధ్వర్యంలో మహిళలకు అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మహిళ సాధికారత సంస్థ నిర్వాహకురాలు యశోద అన్నారు. సోమవారం మండలంలోని జందాపూర్, చాందా (టి)లో ఉపాధి పనులు చేస్తున్న మహిళలతో సమావేశం నిర్వహించారు. మహిళ సాధికారత కేంద్రం అవశ్యకత, మిషన్ శక్తి పథకం, సామర్థ్య పథకం, మహిళా చట్టాలు, పని చేసే చోట లైంగిక వేధింపులు, సైబర్ క్రైం, మహిళల హక్కులు, సుకన్య సమృద్ధి యోజన పథకం గురించి వివరించారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం కేసు వర్కర్ నాగమణి, మహిళలు పాల్గొన్నారు.

తలమడుగు: మండలంలోని ఖోడద్ గ్రామంలో ఉపాధిహామీ కూలీలకు పని ప్రదేశంలో సఖీ కేంద్రం ఆధ్వర్యంలో మహిల చట్టాలపై సోమవారం అవగాహన కల్పించారు. సఖీ కేంద్రం నిర్వాహకులు సంఘమిత్ర మాట్లాడుతూ.. మహిళల, బాలికల చట్టాలు, గృహ హింస చట్టం, బాల్య వివాహాల చట్టం, పోక్సో చట్టం, సైబర్ క్రైం గురించి వివరించారు. కార్యక్రమంలో సుకేశ్న , పారామెడికల్ హెల్త్ వర్కర్, తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ చేయాలి

తలమడుగు: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మండలంలోని లక్ష్మింపూర్ వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని తహసీల్దార్ రాజ్‌మోహన్ అన్నారు. సోమవారం చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటర్లను ప్రభావితం చేసేందుకు అక్రమంగా మద్యం, డబ్బులను సరఫరా చేస్తారని వాటిపై నిఘా పెట్టాలన్నారు. చెక్‌పోస్ట్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్, ఏఎస్సై సురేందర్, ఎంపీవో వినోద్, సంతోశ్, మనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.

వేధిస్తే సమాచారం ఇవ్వండి

ఆదిలాబాద్‌టౌన్: ఆకతాయిలు వేధిస్తే షీటీంకు సమాచారం ఇవ్వాలని షీటీం ఇన్‌చార్జి సభ్యులు సుశీల, సత్యమోహన్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఆదిలాబాద్ అర్బన్ కేజీబీవీ పాఠశాలను సందర్శించి షీటీం విధులు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, మాట్లాడిన, ఫొటోలు మార్ఫింగ్ చేసి బెదిరింపులకు పాల్పడితే సమాచారం ఇవ్వాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి చూపాలి



ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ: యువత వ్యసనాలకు దూరంగా ఉండి, క్రీడలపై ఆసక్తి చూపాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని పటేపటితండాలో సోమవారం క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఇందులో గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడలతో మానసికోల్లాసం, శారీరకంగా ధృడంగా ఉంటారని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆడే రాంచందర్ నాయక్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లే నానక్‌సింగ్, బీఆర్ఎస్ మండల నాయకులు రాథోడ్ సురేందర్, జహీర్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఆదిలాబాద్‌రూరల్: క్రీడలు మానసికోల్లాసం పెంపొదిస్తాయని ఎంపీపీ గంద్రత్ రమేశ్ అన్నారు. జోగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పొచ్చర గ్రామంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని గెలుపొందిన వారికి మెమెంటో, నగదు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటమి చెందిన వారు నిరాశ చెందకుండా గెలుపు కోసం కృషి చేయాలన్నారు. మొదటి బహుమతి మంచిర్యాల జట్టుకు జోగు ఫౌండేషన్ సహకారంతో రూ. 25 వేల నగదు, ద్వితీయ బహుమతి మల్లాపూర్ జట్టుకు రూ. 15 వేలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మెట్టు ప్రహ్లాద, కుమ్ర రాజు, సతీష్, రాజారెడ్డి, ఊషన్న, నిలేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జవాన్‌కు ఘన స్వాగతం



జవాన్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

నార్నూర్: మండల కేంద్రానికి చెందిన ఆసిఫ్ అస్సాం రైఫిల్‌కు ఎంపికై నాగాలాండ్‌లో 9 నెలలు శిక్షణ ముగించుకుని తొలిసారిగా స్వగ్రామానికి రావడంతో సోమవారం ఆయనకు గ్రామస్తులు, గ్రామపెద్దలు ఘన స్వాగతం పలికారు. భారీ ర్యాలీ నిర్వహించి, శాలువాతో సత్కరించారు. ఆసిఫ్ నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడని కొనియాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఆడే సురేశ్, మెస్రం హనుమంతరావు, బానోత్ గజానంద్ నాయక్, ఆఫ్సర్ ఖాన్, ఫిరోజ్ ఖాన్, మహమ్మద్ ఖురేషి, కొర్రెల మహేందర్, గజానంద్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్‌వో కుడ్మేత మనోహర్

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది ప్రజల ఆరోగ్య విషయంపై అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా హైరిస్క్ గర్భిణులు, బాలింతలను గుర్తించి ఎప్పటికప్పుడు వైద్య సేవలు అందించాలని అదనపు డీఎంహెచ్‌వో కుడ్మేత మనోహర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, ఆస్పత్రి సిబ్బంది సమావేశం నిర్వహించారు. ప్రజల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యుడు శ్రీకాంత్, సీహెచ్‌వో సందీప్, హెచ్‌ఈవో తులసిదాస్, పీహెచ్ఎన్ జ్యోతి, హెల్త్ సూపర్‌వైజర్ జాదవ్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఇచ్చోడ: సర్కారు ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని అడిషనల్ డీఎంహెచ్‌వో సాధన అన్నారు. సోమవారం నర్సాపూర్ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలు రికార్డులను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే గర్భిణులకు, బాలింతలకు ప్రతీ నెల వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేయాలన్నారు. ఆస్పత్రికి సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. చిన్న పిల్లలకు వారం వారం టీకాలు ఇవ్వాలన్నారు. ఆమె వెంట డాక్టర్ కిరణ్, వైద్య సిబ్బంది రాథోడ్ కృష్ణ, తదితరులు ఉన్నారు.

మేడిగూడలో వైద్య శిబిరం

నార్నూర్: గాదిగూడ మండలంలోని మేడిగూడ గ్రామంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యుడు ప్రవీణ్ కుమార్ వైద్య పరీక్ష చేసి మందులు పంపిణీ చేశారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసరం ఉంటే తప్పా బయటికి వెళ్లావద్దన్నారు. అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పవర్ రవీందర్, బాపురావు, ఆశ కార్యకర్త దుర్పత బాయి, తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన జొన్న పంట



దెబ్బతిన్న జొన్న పంట

నార్నూర్: వాతావరణంలో వచ్చిన మార్పు కారణంగా గత రెండు రోజులుగా వడగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురుస్తోంది. ఆదివారం అర్ధరాత్రి భారీ కురవడంతో జొన్న పంట నేలకొరిగింది. చేతికొచ్చిన పంట నేలకొరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని మాన్కాపూర్, రాజులగూడ, తాడిహత్నూర్, నాగల్‌కొండ శివారులో వందల ఎకరాల్లో జొన్నపంట నేలవాలింది. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.